సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 22 । నవంబర్ । 2023



ఘనంగా గాయత్రీ హోమం

కొయ్యూరు: మండలంలోని ఎర్రగొండమ్మ తల్లి ఆలయంలో మంగళవారం విశ్వ గాయత్రీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



వైఎస్సార్‌సీపీతోనే అభ్యున్నతి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే గిరిజనుల అభ్యున్నతి సాధ్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. 8లో



ఘనంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.

న్యూస్‌రీల్

గుర్తేడు ఎస్‌ఐగా సాయికుమార్



మారేడుమిల్లి : వై.రామవరం మండలం గుర్తేడు ఎస్‌ఐగా పి. సాయికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చింతపల్లి మండలం అన్నవరం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ జ్వాలా సాగర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు బదిలీ అయ్యారు.

వంట్లమామిడిలో జోరుగా రామాఫల విక్రయాలు

సాక్షి,పాడేరు: మండలంలోని వంట్లమామిడిలో రామాఫలాల విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడం ముందుగానే దిగుబడి ప్రారంభమైంది. రామాఫలం సైజును బట్టి ఒకొక్క పండును రూ.20 నుంచి రూ.30కు గిరిజనులు విక్రయిస్తున్నారు. ఈ మార్గంలో మైదాన ప్రాంతాలకు వెళ్లేవారితోపాటు పర్యాటకులు కొనుగోలు చేస్తున్నారు. సుమారు 10 పండ్లు ఉన్న బుట్టను రూ.200 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారు.

కరాటే పోటీలకు జన్నీ టోనీ ఎంపిక



జన్నీ టోనీకి నగదు అందజేస్తున్న శ్యామ్‌గణేష్

అరకులోయ రూరల్: మండలంలో లోతేరు పంచాయతీకి చెందిన జన్నీటోనీ అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 24 నుంచి 26వరకు విశాఖపట్నం పోర్టు స్టేడియంలో సీనియర్ విభాగంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటున్నట్టు కోచ్ పాంగి చిట్టిబాబు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మెడికల్ షాపు యజమాని శ్యామ్ గణేష్ మంగళవారం జన్నీ టోనీకి ఆర్థికసాయం అందజేశారు.

ఘనంగా శోభాయాత్ర

- కోదండ రామాలయానికి అయోధ్య రాముల అక్షింతలు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

రంపచోడవరం : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రంపచోడవరంలో మంగళవారం శోభాయాత్రను భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయానికి విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి అన్నంరెడ్డి నందకిషోర్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి రాములవారి అక్షింతలను తీసుకువచ్చిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణకు హిందువులంతా కృషి చేయాలని ధర్మ ప్రచార సేవాభక్త మండలి కోఆర్డినేటర్ నల్లమిల్లి వెంకట రామారెడ్డి కోరారు.

సారా బట్టీపై దాడి.. ఒకరి అరెస్టు

- ముగ్గురు పరారీ



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు, నిందితుడితో పోలీసులు

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి పంచాయతీలోని లక్కవరప్పాడు అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారా బట్టీపై మంగళవారం సీఐ బాజీలాల్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. సుమారు 800 లీటర్ల బెల్లం పులుపుతోపాటు తరలించేందుకు సిద్ధం చేసిన 20 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. తయారీకి వినియోగించే డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వంతల నాగేశ్వరావు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు చెప్పారు. పరారీలో ఉన్న మరో ముగ్గురికోసం గాలిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎస్‌ఐ ఎస్. వెంకయ్య, స్పెషల్ బ్రాంచ్ హెచ్‌సీ దుర్గారావు, సాయుధ పోలీసులు పాల్గొన్నారు.

వాన.. రైతన్న హైరానా!

అల్పపీడనం కారణంగా జిల్లావ్యాప్తంగా మంగళవారం కురిసిన వర్షంతో వరి రైతులు హైరానాకు గురయ్యారు. భారీ వర్షం కానందున ఊపిరి పీల్చుకున్నారు. పొలాల్లో ఆరబెట్టిన వనలను ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలించి కుప్పలు వేశారు. టార్పాలిన్లతో రక్షణ కల్పించారు.



హుకుంపేట మండలం కామయ్యపేట ప్రాంతంలో వరి కుప్పలకు కప్పిన టార్పాలిన్లు, ప్లాస్టిక్ కవర్లు

- జిల్లా వ్యాప్తంగా వర్షంతో అన్నదాత అవస్థలు
- సురక్షిత ప్రాంతాలకు వరిపనలు

సాక్షి,పాడేరు: అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి వరి రైతులు ఆందోళనకు గురయ్యారు. పాడేరు మండలంలోని మినుములూరు, మోదాపల్లి, వనుగుపల్లి, వంట్లమామిడి, సలుగు, దేవాపురం పంచాయతీల్లో కుండపోత వానకు వరి పంటకు నష్టం జరగకుండా జాగ్రత్తపడ్డారు. కోసిన వరిపనలను మంగళవారం ఉదయం నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భారీ వర్షం కురుస్తుందనే భయంతో వర పనలను కుప్పలుగా ఏర్పాటుచేసి ప్లాస్టిక్ కవర్లు, టార్పాలిన్లతో రక్షణ కల్పించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయశాఖ అప్రమత్తమైంది. వరికోతలు నిలిపివేయాలని రైతులకు సూచనలు జారీ చేసింది. మంగళవారం సాయంత్రానికి వాతావరణంలో మార్పు చోటుచేసుకోవడంతో పాటు వర్షం తెరిపివ్వడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రైతులకు ఎటువంటి నష్టం చేకూరకుండా ముందు జాగ్రత్తలు చేపట్టేలా రైతులను అప్రమత్తం చేయాలని తహసీల్దార్లను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

చింతపల్లి రూరల్: మండలంలో పలు చోట్ల ఉదయం నుంచి సాయంత్రం వరకూ సుమారు ఐదు గంటలపాటు వర్షం కురిసింది. దీంతో అప్రమత్తమైన వరి రైతులు పొలాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు చేపట్టారు.

ముంచంగిపుట్టు: అల్పపీడన ప్రభావంతో మంగళవారం మండలంలో కొన్ని చోట్ల చిరుజల్లులు కురవడంతో రైతులు అప్రమత్తమయ్యారు. వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పి నష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. చాలాచోట్ల పొలాల్లో కోతలు అనంతరం వరి పనలు ఆరబెట్టడం వల్ల వర్షం ఎక్కువైతే నష్టం జరిగే అవకాశం ఉందని గిరి రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి పరిసరాల్లో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. పొగాకు తదితర వాణిజ్య పంటలకు కాస్త ఊపిరి పోశాయి. వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులు వరి కోతలను వాయిదా వేసుకున్నారు. కోసిన చోట వరి పనలను ఒడ్డుకు చేరి కుప్పలుగా ఏర్పాటుచేసి టార్పాలిన్లు కప్పారు. గింజర్తి గ్రామంలో వరి పనలు పాక్షికంగా తడిచినట్టు రైతులు తెలిపారు.

పెదబయలు: మండలంలో మంగళవారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొనడంతో వరి రైతులు అప్రమత్తమయ్యారు. వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలించి కుప్పలుగా వేశారు.



పన్నెడ ప్రాంతంలో వరి కుప్పలకు కప్పిన టార్పాలిన్లు



మినుములూరులో కురుస్తున్న వర్షం



కొండపడలో వరి కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు

- మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి
- కమిటీల ఆధ్వర్యంలో చేపట్టాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

పాడేరు రూరల్ : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండో దశలో మంజూరైన నాడు–నేడు పనులను అంగన్‌వాడీ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి ఆదేశించారు. మంగళవారం పాడేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నాడు–నేడు పనులపై మండలంలోని సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రెండో దశలో జిల్లాలో 1205 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు మరమ్మతులు చేపడతామన్నారు. అంగన్‌వాడీ కమిటీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కన్వీనర్‌గా ఉంటారని, స్థానిక అంగన్వాడీ వర్కర్, మహిళ సంరక్షణ అధికారి(మహిళ పోలీస్) ఇంజనీరింగ్ అసిస్టెంట్, పాఠశాల హెచ్‌ఎం, రెండేళ్ల నుంచి నాలుగేళ్లలోపు వయసు ఉన్న పిల్లల తల్లులు ముగ్గురు సభ్యులుగా ఉంటారని చెప్పారు. కాంట్రాక్టర్ వ్యవస్థకు తావులేకుండా ఉండేలా ప్రజల భాగస్వామ్యంతో అంగన్వాడీ కమిటీల ద్వారా మరమ్మతు పనులు చేపట్టాలని ఆమె ఆదేశించారు.

నాసిరకం, కల్తీ సరకులు విక్రయిస్తే చర్యలు





కిరాణా దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాల్, సేకరించిన శాంపిళ్లు

- జిల్లావ్యాప్తంగా 20 కేసులు నమోదు
- అరకులో ఐదు హోటళ్లకు హైజీన్ రేటింగ్ లైసెన్సులు
- జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వేణు గోపాల్

రాజవొమ్మంగి: నాసిరకం, కల్తీ సరకులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ బి. వేణు గోపాల్ హెచ్చరించారు. మంగళవా రం ఆయన మండల కేంద్రం రాజవొమ్మంగిలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కిరాణా దుకాణాల్లో సరకులను తనిఖీ చేశారు.పప్పు దినులు, మసాలా సరకులకు సంబంధించి శాంపిళ్లు సేకరించారు. వాటిని ల్యాబ్‌కు పంపించి, నాణ్యత నివేదిక ఆధారంగా దుకాణాదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. జిల్లాలో ఇప్పటివరకు 20 కేసులు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

ప్రతి దుకాణదారు ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. అరకులో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్న ఐదు హోటళ్లకు హైజీన్ రేటింగ్ లైసెన్సులు ఇచ్చినట్టు చెప్పారు.

పంట అమ్మకాలకు వారపు సంతలు కీలకం

ఎమ్మెల్సీ కుంభా రవిబాబు



లక్క గ్రామంలో వారపు సంతను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

డుంబ్రిగుడ: ఏజెన్సీలో గిరి రైతులు పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు వారపు సంతలు కీలకమని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని గుంటగన్నెల పంచాయతీ లక్క గ్రామ సమీపంలోని మైదానంలో వారపు సంతను ఆయన ప్రారంభించారు. గిరి రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఏ ప్రభుత్వం చేయలేని విధంగా పాడేరులో రూ.500 కోట్లతో వైద్య కళాశాల నిర్మించి ఆధునిక వైద్య వసతులను అందుబాటులోకి తెస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నేతలు హరి, చిన్నారావు, రఘునాథ్, పరుశురాం, రాందాస్, ఎంపీటీసీ కూడా పాపారావు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన



బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సబ్ డీఎఫ్‌వో శ్రీరామారావు

రాజవొమ్మంగి: మండలంలోని వయ్యేడు నుంచి బూరుగపల్లి వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న బీటీ రోడ్ పనులను మంగళవారం అడ్డతీగల సబ్ డీఎఫ్‌వో బి. శ్రీరామారావు సిబ్బంది కలిసి పరిశీలించారు. రోడ్డు పొడవునా తొలగిస్తున్న చెట్లు, వినియోగిస్తున్న అటవీ భూమి వివరాలను సేకరించారు. అంతకు ముందు ఆయన స్థానిక అటవీక్షేత్ర కార్యాలయంలో అటవీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అటవీ సంరక్షణపై గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. ప్లాంటేషన్లలో ఒక్క చెట్టు పోయినా అందుకు సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. కలప అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ డీఎఫ్ఓ సిబ్బందిని సూచించారు. రేంజ్ అధికారి అబ్బాయిదొర, ఎఫ్ఎస్‌వోలు, బీవోలు పాల్గొన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



రికార్డులను పరిశీలిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం : విద్యార్థులకు సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని కాకవాడ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని రిజిస్టర్లు, స్టోర్ రూమ్‌లు, తరగతి గదులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితిల్లోనూ సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయుల బోధనపై విద్యార్థులతో మాట్లాడారు. భోజనం విషయంలో మెనూ అమలు చేస్తున్నారా లేదా అని విద్యార్థులను ప్రశ్నించారు. పాఠశాల ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వరాలు సోకితే తక్షణమే సమీప ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మహిళలకు రూ. 2.8 కోట్ల రుణాల పంపిణీ

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



చెక్కు అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత్ ఉదయ్ భాస్కర్

కూనవరం: డ్వాక్రా మహిళలకు ప్రభుత్వ పలు పథకాలను అమలు చేస్తోందని మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. పోచవరం సచివాలయంలో మంగళవారం డ్వాక్రా మహిళలకు శ్రీనిధి, రివాల్వింగ్, సీఐఎఫ్ నిధుల కింద రూ. 2.8 కోట్లు రుణాలు మంజూరు సంబంధించిన చెక్‌ను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అందజేశారు. అనంతరం వారు మాట్లడుతూ 434 మంది సభ్యులకు రుణాలు అందనున్నాయని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, మండల కన్వీనర్ అలూరి కోటేశ్వరరావు, ఆరెకటిక రాష్ట్ర డైరెక్టర్ అరవా వెంకటరామారావు, మాజీ వైఎస్ ఎంపీపీ గుజ్జాబాబు, సొసైటీ అధ్యక్షుడు నోముల కొండలరావు, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇంటి పూర్ణానందం, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, డీటీ, ఏపీఎం భాస్కర్, సర్పంచ్‌లు, ఎంపీటీలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సత్వర సేవలు అద్భుతం



వంట్లమామిడి గ్రామ సచివాలయం సేవలపై సమీక్షిస్తున్న పీఎం అదనపు కార్యదర్శి అతీష్‌చంద్ర



అటవీ హక్కుల పత్రం అందజేస్తున్న పీఎం అదనపు కార్యదర్శి, అతీష్‌చంద్ర



ఉచిత గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేస్తున్న అతీష్‌చంద్ర,కలెక్టర్ సుమిత్‌కుమార్

- ప్రధానమంత్రి అదనపు కార్యదర్శి అతీష్‌చంద్ర
- వంట్లమామిడి గ్రామ సచివాలయం సందర్శన
- ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, అటవీ హక్కు పత్రాల పంపిణీ



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న అతీష్‌చంద్ర

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామసచివాలయాల ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందించడం అద్భుతమని ప్రధానమంత్రి అదనపు కార్యదర్శి అతీష్‌చంద్ర పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రను పరిశీలించేందుకు మంగళవారం పాడేరు మండలం వంట్లమామిడిలో పర్యటించిన ఆయన అక్కడి గ్రామసచివాలయాన్ని సందర్శించారు. సచివాలయాల వ్యవస్థలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులు ప్రజలకు అందిస్తున్న సేవలు,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజేస్తున్న పథకాలపై ఆయన సమీక్షించారు. సచివాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. సచివాలయ వ్యవస్థను ఆయన ప్రశంసించారు. గ్రామ వార్డు సచివాలయాల విభాగం అదనపు సంచాలకులు భావన, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్న అన్ని సేవలను సమగ్రంగా వివరించారు. సచివాలయం ఎదుట అతీష్‌చంద్ర మొక్కను నాటారు. ప్రభుత్వ పథకాల ఫొటోలు, డీఆర్‌డీఏ, జీసీసీ, ఐసీడీఎస్ స్టాళ్లను పరిశీలించారు. వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఉజ్వల పథకం గ్యాస్ కనెక్షన్లతో పాటు అటవీ భూములకు హక్కు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎస్పీ తుహిన్‌సిన్హా, పోర్టు వైస్‌చైర్మన్ దురేష్‌కుమార్‌దుబే, ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్, వెంకటేశ్వరరావు, ఏపీవో శ్రీనివాసకుమార్, డీఎల్‌డీవో శాంతకుమారి, జీసీసీ పాడేరు డీఎం డి.సింహాచలం,డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, ఎంపీడీవో నవీన్, సర్పంచ్ పాంగి రాంబాబు, ఎంపీటీసీ జి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధే లక్ష్యం

అరకులోయ రూరల్: గిరిజనాభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధాన మంత్రి అదనపు కార్యదర్శి అతీష్‌చంద్ర తెలిపారు. మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ కేంద్రంలో మంగళవారం ఆయన పర్యటించారు. గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర విజయవంతంగా సాగుతోందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ యాత్ర ఎంతో దోహద పడుతోందన్నారు.

ఐటీడీఏ నిధులతో గ్రామాల అభివృద్ధి: కలెక్టర్ సుమిత్‌కుమార్

గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ నిధులతో ప్రత్యేక సేవలు, అభివృద్ధి పనులు చేపడుతున్నాని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పోడు హక్కు పట్టాలు, గ్యాస్ కనెక్షన్లు, ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన కార్డులు పంపిణీ చేసినట్టు చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు.

ఉపాధి మెరుగుకు చర్యలు: పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

మన్యంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి తద్వారా గిరి యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తెస్తున్నామని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ వివరించారు. నాడు–నేడు పథకంలో పాఠశాలలు అభివృద్ధి చేసినట్టు చెప్పారు. ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి ఆధునిక వైద్యసేవలను ప్రజలకు మరింత చేరువ చేసినట్టు తెలిపారు. ఇలావుండగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ ప్రాంత కాఫీ రైతులు అతీష్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ పర్యటనలో పోర్టు వైస్ చైర్మన్ దురేష్‌కుమార్ దూబే, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పాడేరు ఘాట్‌లో దట్టంగా కురుస్తున్న పొగమంచు



మంచు తెరల మధ్య హెడ్‌లైట్ వెలుగులో ప్రయాణం



మంచు ముసుగులో పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు క్షేత్రం

సాక్షి,పాడేరు: గత రెండు రోజులుగా పాడేరు ఘాట్‌లో దట్టంగా కురుస్తున్న పొగమంచు, కమ్ముకున్న మేఘాలు, చలిగాలులు ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రాంతం సముద్రమట్టానికి 2600 అడుగుల ఎత్తులో ఉంది. పగలు,రాత్రి తేడా రోజంతా మంచు కురుస్తోంది. మోదకొండమ్మ తల్లి పాదాల క్షేత్రాన్ని పూర్తిగా కమ్మేసింది.మోదాపల్లి, గుర్రగరువు, డల్లాపల్లి, రాజాపురం గ్రామాలు మంచు ముసుగులో ఉన్నాయి. మినుములూరు నుంచి 12వమైలురాయి వరకు 15కిలోమీటర్ల పొడవునా ఘాట్ రోడ్డంతా పొగమంచు కమ్ముకోవడంతో వాహన చోదకులు హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు.కాఫీతోటలు ఈ ప్రాంతాల్లో విస్తారంగా ఉన్నందున సీజన్‌తో సంబంధం లేకుండా నిత్యం చల్లని వాతావరణం ఉంటుంది. మోదాపల్లి పంచాయతీలోని గిరిజనులంతా నిత్యం మంచుతోనే జీవనం సాగిస్తున్నారు. చలిమంటలు కాగుతూ ఉపశమనం పొందుతున్నారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ మానవ హక్కుల డిఫెండర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా సింహాచలం



పాడేరు రూరల్ : అంతర్జాతీయ మానవ హక్కుల డిఫెండర్స్ (ఐహెచ్ఆర్డీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పాడేరుకు చెందిన గిరిజనుడు కుర్రబోయిన సింహాచలం నియమితులయ్యారు. ఈ మేరకు ఐహెచ్ఆర్డీ వ్యవస్థాపకులు, జాతీయ చైర్మన్ మినకేటర్ పట్నాయక్ పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ మానవ హక్కులు, గిరిజనుల చట్టాలు పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న పార్టీ కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి

మారేడుమిల్లి : రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని బోదులూరు సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది మంది పేద ప్రజలు లబ్ధిపొందారని చెప్పారు. జేసీఎస్ కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్, ఎంపీపీ సార్ల లలిత కుమారి, ఏఎంసీ డైరెక్టర్ దూడ స్మిత్, బోదులూరు సర్పంచ్ ప్రేమ్‌లత పాల్గొన్నారు.

24న సదరం మెడికల్ క్యాంప్



కిరణ్‌కుమార్

డుంబ్రిగుడ: దివ్యాంగులైన పిల్లల కోసం ఈ నెల 24న అరకులోయ ప్రభుత్వం ఉన్నత పాఠశాల ఆవరణంలో జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉచిత సదరం క్యాంప్ నిర్వహించనున్నట్టు మండల ఐఈఆర్పీ అగతమ్మిడి కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఈ శిబిరానికి హాజరు కావాలన్నారు. మెడికల్ క్యాంపునకు హాజరయ్యే వారు తల్లిదండ్రులు బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, రేషన్ కార్డులను జెరాక్స్ కాపీలను తీసుకురావాలని కోరారు. పూర్తి వివరాల కోసం 63022 26893 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే అభ్యున్నతి



పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొటగుళ్ల భాగ్యలక్ష్మి, నాయకులు



మట్టుజోరులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ఎమ్మెల్యే కొటగుళ్ల భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే గిరిజనుల అభ్యున్నతి సాధ్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని అంజలిశనివారంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించి పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంజలిశనివారం పంచాయతీకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, ఎంత మేరకు గిరిజనులు లబ్ధి పొందారో వివరించారు. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా అయితే అందరికీ మరింత మంచి జరుగుతుందని చెప్పారు. అనంతరం తాజంగిలో రైతులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఎం కిసాన్-వైఎస్సార్ రైతు భరోసా కింద ప్రతీ ఏటా రూ.13,500 కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందిస్తున్నాయన్నారు. మండలంలో 220 పట్టాలు మంజూరైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, తహసీల్దార్ లచ్చాపాత్రుడు, అంజలి శనివారం సర్పంచ్ రాజుబాబు, తాజంగి సర్పంచ్ మహేశ్వరి, ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, ఎంపీటీసీలు ధారలక్ష్మి, వెంగళరావు, కో ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, నాయకుడు రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో గడప వద్దకే పథకాలు

హుకుంపేట: సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గడప వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వాటి ద్వారా ప్రతి గిరిజనుడికి మేలు జరుగుతోందని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే, పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మట్టుజోరులో స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించడమే కాకుండా, వలంటరీ, సచివాలయ వ్యవస్థల ద్వారా గ్రామ స్థాయిలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఈ పంచాయతీ పరిధిలో ఇంతవరకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రభుత్వం రూ.8,18,68,752 ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినాయ్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ, స్థానిక సర్పంచ్ సీదరి సాంబ, నాయకులు మురళి, కోటిబాబు, జన్ని సింహాచలం, సుబ్బారావు, చప్పల మహేష్, రాజారావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీచట్టారి జానకమ్మ అన్నారు. జోరు వానలోనూ స్థానిక గ్రామ సచివాయల ఆవరణంలో మంగళవారం రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ క్యాలెండర్‌ను ఎంపీపీ, జెడ్పీటీసీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరారావు, పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు శాంతి, సర్పంచ్‌లు వెంకటరావు,నాగేశ్వరరావు, ఎంపీటీసీ పద్మ,ఉపాధ్యక్షులు జగ్గునాయుడు, గణపతి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ సద్దు,సీనియర్ నాయకులు తుఫ్‌నాథ్,సింహాచలం,కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి

ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్



బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ

కూనవరం: పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. పోచవరం సచివాలయం పరిధిలోని కాచవరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ అందుకు సంబంధించిన బ్రోచర్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కాచవరం గ్రామపంచాయతీ ఈ నాలుగేళ్లలో రూ.13.45 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీరుల ద్వారా గడప గడపకు నిర్ణీత గడువులోనే సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు సీఎంను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, జేసీఎస్‌మండల ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, ఆరెకటిక రాష్ట్ర డైరెక్టర్ అరవావెంకటరామారావు, మాజీ వైఎస్ ఎంపీపీ గుజ్జా బాబు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి నోముల కొండలరావు, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇంటి పూర్ణానందం, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : కేరళ రాష్ట్రంలోని శబరిమలలో అయ్యప్పస్వామిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో విశాఖపట్నం - కొల్లాం - విశాఖపట్నం, శ్రీకాకుళం రోడ్ - కొల్లాం - శ్రీకాకుళం రోడ్ మధ్య పలు ప్రత్యేక రైళ్లు నడిపేందుకు నిర్ణయించినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ కృషితో ఈ రెండు ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు.

- శ్రీకాకుళం రోడ్ - కొల్లాం (08537) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ శ్రీకాకుళం రోడ్‌లో ప్రతీ శనివారం ఉదయం 11 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1.42 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 1.47 గంటలకు బయల్దేరి ఆదివారం సాయంత్రం 6 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు నవంబర్ 25 నుంచి జనవరి 27 వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం - శ్రీకాకుళం రోడ్ (08538) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొల్లాంలో ప్రతీ ఆదివారం రాత్రి 7.35 గంటలకు బయల్దేరి సోమవారం రాత్రి 11 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 11.05 గంటలకు బయల్దేరి మంగళవారం తెల్లవారుజామున 2 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు నవంబర్ 26 నుంచి జనవరి 28 వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం - కొల్లాం (08539) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నంలో ప్రతీ బుధవారం ఉదయం 8.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు గురువారం మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ రైలు నవంబర్ 29 నుంచి జనవరి 31 వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం - విశాఖపట్నం (08540) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొల్లాంలో ప్రతీ గురువారం రాత్రి 7.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు శుక్రవారం రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు నవంబరు 30 నుంచి ఫిబ్రవరి 1 వరకు నడుస్తుంది.

టీ-20కి సర్వం సిద్ధం



మ్యాచ్ నిర్వహణ ఏర్పాట్లను వివరిస్తున్న టోర్నీ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, చిత్రంలో సీపీ రవిశంకర్, కమిషనర్ సాయికాంత్, ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

విశాఖ కలెక్టర్ మల్లికార్జున

విశాఖ స్పోర్ట్స్: టీ-20 సిరీస్‌లో భాగంగా భారత్‌తో ఆస్ట్రేలియా తలపడే తొలి మ్యాచ్‌కు విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. గురువారం రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా స్టేడియంలో మంగళవారం నిర్వాహక కమిటీ సమావేశమైంది. కమిటీ అధ్యక్షుడు, కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ మ్యాచ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మళ్లింపు కోసం డీఎస్పీ స్థాయి అధికారులను నియమించామన్నారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ స్టేడియంను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. స్టేడియంలో కొన్ని గ్యాలరీల్లో కుర్చీలను మార్పు చేసి అభిమానులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కార్పొరేట్ గ్యాలరీని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది.. ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేశామన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ మాట్లాడుతూ స్టేడియంలో పారిశుధ్యం నిర్వహణ, ఫుడ్‌స్టాళ్లు, మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఆరు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచామన్నారు. మ్యాచ్ నిర్వాహక కమిటీ, వీడీసీఏ ప్రతినిధులతో పాటు సీఈవో శివారెడ్డి పాల్గొన్నారు.

గ్రామ గ్రామానా పల్లెనిద్ర



వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు స్వామి



నెల్లిపూడిలో జెండా ఆవిష్కరిస్తున్న సర్పంచ్ రమణమ్మ



జర్జులలో పల్లె నిద్ర చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అనంతగిరి: మండలంలోని కొండిబ పంచాయతీలోని లింబగుడ, మువ్వంవలస గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమం వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టినీలవేణి, రేగబోయిన స్వామి మాట్లాడుతూ..ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల అందాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు మదీనా, సీనియర్ నాయకులు దానియేలు, మధుసూదన్, సుబ్బారావు, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిపూడిలో..

గంగవరం : మండలంలోని నెల్లిపూడి గ్రామ సర్పంచ్ పాతర రమణమ్మ ఆధ్వర్యంలో మంగళవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్లలో నెల్లిపూడి సచివాలయం పరిధిలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఏర్పాటు చేసిన బోర్డును ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. పార్టీ జెండాను సర్పంచ్ రమణమ్మ ఎగురవేశారు. వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, నెల్లిపూడి ఎంపీటీసీ కనకలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అప్పలరాజు, సచివాలయ కన్వీనర్ శోభన్‌బాబు, వార్డు సభ్యులు పిర్లశ్రీను, పార్టీ నాయకులు మాగంటి సత్తిబాబు, బాబ్జి, సత్తిబాబు, ఏసుబాబు, ప్రకాశ్, టి.వి.రమణ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



గొంటువానిపాలెంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు మద్దాల వీర్రాజు

జర్జులలో..

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయతీ కేంద్రంలో మంగళవారం మండల వైఎస్సార్‌సీపీ నేతలు పల్లె నిద్ర నిర్వహించారు. ప్రజలతో రాత్రి పూట సమావేశమయ్యారు. సంక్షేమ పథకాలు అమలు తీరుపై అడిగి తెలుకుని, ప్రభుత్వం పాలన, చేస్తున్న అభివృద్ధిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ, మండల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్,సర్పంచ్ పోర్తిమ్మ, ఎంపీటీసీ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, మండల కన్వీనర్ కొండలరావు, మండల నేతలు రాంప్రసాద్, తిరుపతి, పద్మారావు, జగన్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గొంటువానిపాలెంలో..

అడ్డతీగల: మండలం గొంటువానిపాలెం గ్రామసచివాలయం వద్ద మంగళవారం జెడ్పీటీసీ సభ్యుడు మద్దాల వీర్రాజు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సచివాలయం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ రూపొందించిన బోర్డులను ప్రదర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, బ్రోచర్లను అందజేశారు. వైఎస్ ఎంపీపీ బాలసుబ్రహ్మణ్యం, మండల జేసీఎస్ కన్వీనర్ నక్కా మోహన్, గొంటువానిపాలెం సర్పంచ్ పల్లాల ఏగులమ్మ పాల్గొన్నారు.

పథకాలు కొనసాగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలి



గొండెలి గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మంపలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రమేష్



దారగడ్డ సచివాలయం వద్ద పతాకావిష్కరణ చేసి, మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పాడేరు రూరల్ : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు మరింతగా అమలు జరగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు అన్నారు. గొండేలి గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం ఏపీకి మళ్లీ జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఓ వైపు భారీ వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. గొండెలిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామ సచివాలయం ఎదుట సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో వెచ్చించిన నిధులతో కూడిన బోర్డును ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పలాసి కోటేశ్వరరావు, సర్పంచ్ వంతాల రాంబాబు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, జిల్లా కార్యవర్గ సభ్యుడు సిరగం దశమూర్తి, మండల ఉపాధ్యక్షుడు పసుపుల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు దూసురి సన్యాసిరావు, గ్రామ సచివాలయ కన్వీనర్లు పలాసి రామారావు, కొర్రా బాలరాజు, పాడి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండె చప్పుడు జగన్

కొయ్యూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండె చప్పుడుగా మారారని ఎంపీపీ బడుగు రమేష్ అన్నారు. మంపలో మంగళవారం నిర్వహించిన 'రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, సచివాలయ కన్వీనర్ బండి సుధాకర్, సర్పంచ్ ఇంగువ త్రినాథ్‌పడాల్, కన్వీనర్లు ఆగూరు రాంబాబు, పుష్ప,వాసు, అరిమెల కొండబాబు,సచివాలయ కార్యదర్శి పవన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

వై.రామవరం: సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి అఖండ మెజార్టీని చేకూర్చి, తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తాయని ఎంపీపీ కడబాల ఆనందరావు అన్నారు. మండల ఎగువప్రాంతం దారగడ్డ గ్రామ సచివాలయంవద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రవెంకటలక్ష్మి, వైస్ఎం పీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మొదటగా పతాకావిష్కరణ చేసి, మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూలమాలలువేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం కనకరాజు, తిరుపతిరెడ్డి, భారతిబాబు, కలిమెల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు, పరికరాల పంపిణీ



ఎరువులు, పరికరాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్ అక్కమ్మ

గంగవరం : రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, సర్పంచ్ కలుముల అక్కమ్మ అన్నారు. స్థానిక గ్రామసచివాలయంలో మంగళవారం ఉద్యానవన శాఖ, ఐటీడీఏ ఆధ్వర్యంలో గంగవరం గ్రామంలో తొమ్మిది మంది జీడిమామిడి రైతులకు ఎరువులు, ఎండు కొమ్మలు కత్తిరించే పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అసిస్టెంట్ స్వర్ణలత, పట్టు సహాయకులు రెహానసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

కోస్ట్‌గార్డ్ రీజియన్ కమాండర్ బాధ్యతల స్వీకరణ

సింధియా : చెన్నైలోని కోస్ట్‌గార్డ్ ఎయిర్‌స్టేషన్‌లో నిర్వహించిన ఉత్సవ కవాతులో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆనంద్ ప్రకాష్ బడోలా నుంచి ఈస్ట్రన్ కోస్‌గార్డ్ రీజియన్ కమాండర్‌గా ఇన్‌స్పెక్టర్ జనరల్ డోనీ మైఖేల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆనంద్ ప్రకాష్ బడోలా రెండున్నరేళ్ల కాలం తర్వాత న్యూఢిల్లీని కోస్ట్‌గార్డ్ హెడ్‌క్వార్టర్స్‌కు డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా శాశ్వత బదిలీపై వెళ్తున్నారు. కొత్త రీజినల్ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ జనరల్ డోనీ మైఖేల్ చెన్నైలోని లయోలా కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి 1990 జూలై 6న ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో చేరారు. ఎస్‌డీ స్కూల్ కొచ్చి నుంచి నావిగేషన్ అండ్ డైరెక్షన్‌లో స్పెషలిస్ట్ కోర్సు పూర్తి చేసి, ఇండియన్ నేవల్ అకాడమీలో అకడమిక్ ఎక్సలెన్స్‌లో అనేక అవార్డులు గెలుచుకున్నారు. వరల్డ్ మారిటైమ్ యూనివర్సిటీ (స్వీడన్) నుంచి మారిటైమ్ అఫైర్స్‌లో మాస్టర్స్, సింగపూర్ నుంచి సెర్చ్ అండ్ రెస్క్యూ కోర్సు, 2011లో ఢిల్లీలోని విశ్వవిద్యాలయంలో న్యాయవిద్యను పూర్తి చేసి ఎల్ఎల్‌బీ డిగ్రీ పొందారు.

రేపు కబడ్డీ జట్టు ఎంపిక

పెదగంట్యాడ: ఉమ్మడి విశాఖ జిల్లా మహిళా కబడ్డీ జట్ల ఎంపికలను ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నామని విశాఖపట్నం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బీసీ రోడ్డులోని మార్వెల్ స్కూల్ ఎదురుగా గల కబడ్డీ గ్రౌండ్స్‌లో ఈ ఎంపికలు ఉంటాయన్నారు. 75 కిలోల లోపు బరువు గల వారు అర్హులన్నారు. ఇక్కడ ఎంపిక చేసిన క్రీడాకారులను ఈ నెల 29 నుంచి వచ్చే నెల 1 వరకూ కర్నూలు జిల్లా గోనెగండ్లలో నిర్వహించనున్న 70వ ఆంధ్ర రాష్ట్ర కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9666655355 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎన్ఎంఎంఎస్ హాల్‌టికెట్లు సిద్ధం

విశాఖ విద్య: జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్ఎంఎంఎస్) పరీక్ష డిసెంబర్ 3న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగుతుందని డీఈవో చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. www.bsc.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో పాఠశాల యు-డైస్ కోడ్ ఉపయోగించి హెచ్ఎంలు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి, విద్యార్థులకు అందజేయాలని పేర్కొన్నారు.

విశాఖ బాస్కెట్‌బాల్ జట్టు సత్తా

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ టోర్నీలో విశాఖ మెన్ జట్టు విజేతగా నిలిచింది. మహిళల జట్టు రన్నరప్‌గా నిలిచింది. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజులు జరిగాయి. ఈ టోర్నీలో 18 జిల్లాల జట్లు పోటీపడ్డాయి.